# ★ ★ ★ ★ నిర్మల ★ ★ ★ ★

శ్రీ సన్నాకుల సుందరరావు

సుబ్బులు లేస్తూనే "కృష్ణానదీమాతకి" వందనం ఆచరించింది. కళ్లు నులుపుకొని సుబ్బులు నిర్మల పడుకున్న మంచంవైపు చూసింది. సుబ్బులుకంతా, అయోమయంగాతోచింది. ఆ మంచం మీద నిర్మలలేదు. అప్పుడే అక్కయ్య చెప్పిన మాటలు ఆమె చెవుల్లో మారుమ్రోగాయి. సుబ్బులుకి వళ్ళంతా జలదరించింది.

ఆతృతతో "బావా!" అంటూ గట్టిగా పిలచింది సుబ్బులు. సూర్యం, ఆ పిలుపు విని గాభరాగా లేచాడు. "ఏమయిందేమిటి సుబ్బులూ!" అని ఆశ్చర్యంగా అడిగాడు సూర్యం.

"అక్కయ్య కనపడటంలేదు" అని ఆతృతతో అంది సుబ్బులు.

"క్రిందికి వెళ్లిందేమో ?"

"అదికాదు బావా! రాత్రి తానిక జీవించటం వ్యర్థమనీ, ప్రాణహత్య ఉపాయమే తన గతనీ, అక్కయ్య నాతో చెప్పింది."

"ఆ! అలాగా! అయితే క్రిందికి పద"

సుబ్బులు మెల్లగా లేచి, తడబడే గుండెల్తో సూర్యాన్ని అనుసరించింది. ఆ నడకలో ఆతృత, ఆవేదన ఉట్టిపడుతున్నయ్. కృష్ణానదికీ - శివాలయం వీధికీ ఎంతోదూరంలేదు. మేడమీద నిల్చుంటే, నదీమాత ప్రత్యక్షంగా కన్పిస్తుంది. అప్పుడప్పుడే తెల్లవారుతుంది. సూర్యం రెగ్యులేటర్ మీదకు వచ్చాడు. ఆ అంధకారంలో అక్కడక్కడ దీపాలు మిణుకు మిణుకుమంటున్నయ్.

అప్పుడే మ్యునిసిపల్ సైరన్ నాలుగు గంటలు కూసింది. పడవలు నిలుచుండే రేవు సమీపానికి సూర్యం, సుబ్బులూ వెళ్ళారు.

ఆ రోడ్డు మీద జనసంచారంలేదు. అక్కడక్కడ రిక్షాలు మాత్రం కన్పిస్తున్నయ్. ఆ ప్రశాంత పరిణామంలో నది చేసే హోరుమనే శబ్ధం స్పష్టంగా విన్పిస్తుంది.

ఆ చీకట్లో ఓ ఆకారం! సూర్యాన్ని సమీపించింది. "బాబూ! ఈ అడ్రస్సు కాస్త చదివియ్యండి" ఆ వచ్చిన మనిషి సూర్యానికి అడ్డంగా నిలచి అర్థించాడు.

సూర్యం లాంతరు వెలుగులో ఆకవరు వైపు చూశాడు. అతని కాశ్చర్యం వేసింది. అది తన అడ్రసే! "త్వరగా ఇది ఎవరిచ్చారు" అని అడిగాడు సూర్యం.

"ఒక అమ్మగారిచ్చి అటుగా రోడ్డంట వెళ్ళారు. ఓ ఐదు రూపాయలిచ్చి, ఈ అడ్రసు ప్రకారం ఉత్తరాన్ని అందచెయ్యమన్నారు" అని చెప్పాడతడు.

"మీ అక్కయ్య కొంప ముంచింది సుబ్బులూ" అని విచారంతో అన్నాడు సూర్యం.

సూర్యం గబగబా అంగలు వేసుకుంటూ స్నానాల రేవు వద్దకు వెళ్ళాడు. ఆ అంధకారంలో నది నిశ్చలంగా ప్రవహిస్తుంది. ఆ నీటిపై మాత్రం బట్టలు కన్పించాయతనికి.

సూర్యం నిట్టూర్పు విడిచాడు. సుబ్బులు కూడా అతన్ని సమీపించింది. "సుబ్బులూ! మీ అక్కయ్య ఆత్మహత్య చేసుకుంది" అని విచారవదనంతో అన్నాడు సూర్యం. సుబ్బులు బావురుమంది. సుబ్బుల్ని ఓదార్చి రోడ్డుమీద ఉన్న లాంతరు క్రిందికి వచ్చాడు సూర్యం.

వణుకుతున్న చేతులతో కవరు విప్పాడు సూర్యం. ఆ తరువాత నిర్మలది. నిశ్శబ్దంగా తదేకదీక్షతో సూర్యం ఆ ఉత్తరాన్ని చదువసాగాడు.

'బావా! నేనీప్రపంచాన్నీ, ఆప్తుల్నీ వదలి, నాకు తెలియని, మరొకలోకంలోకి వెళ్లటానికి ఇష్టంలేకపోయినా, ఈ సమాజంలో, సంఘంలో, బ్రతుకలేక, బలవంతంమీద వెడుతున్నా! ఈ ఆత్మహత్య చేసికొని, మీకు, చెల్లికీ, తల్లితండ్రులకీ, దుఃఖాన్ని, పెట్టిపోతున్నాను.

దీనికి కారణం ఎవరూ కాదు. నేను స్త్రీనైయుండి, తోటిస్త్రీలూ, భంధువులూ పొందే, ఆనందాన్ని చూస్తూ! అలాటి ఆనందాలకూ, వినోదలకూ, దూరంగా ఉంటూ, ఒకపనికిరాని వస్తువులా జీవించలేను.

నిన్నువివాహం చేసికోవాలని, ఉవ్విళ్లూరాను. కాని, వరకట్నపిశాచి, నన్ను నీనుంచి దూరంచేసింది. అత్తయ్య, అడిగిన వేలవేలకట్నం నాన్న ఇవ్వలేక నన్నో ముసలాడికిచ్చి చేశారు. దాదాపు ఈ లోకంలో ఉన్న తలిదండ్రులంతా తమ కుమార్తెలను ఎలాగైనా వదిలించుకోటానికి చూస్తుంటారు.

అంత మాత్రనికే నా తలితండ్రులు నా మీద ప్రేమాభిమానాలు చూపలేదని నేననను. స్వతహాగా తల్లిదండ్రులందరికీ పిల్లలంటే అపారమైన ప్రేమఉంటుంది. ఒక సామాన్య గుమస్తా! తనకుమార్తెకు కట్నం ఇవ్వలేక మంచి సంబంధం ఎలా చెయ్యగలడు!

నా భర్త శంకరరావుకి ఆప్తులెవ్వరూ లేరు. అన్నిటినీమించి శక్తివంతమైన ధనం మాత్రం ఉంది. నాకు ఆయనేమీ లోటురానీయలేదు. ఉన్న చీరలు నగలూ

అలంకరించుకుని నా భర్తను సంతోష పెట్టటమే నావిధయింది.

కాని సంసారంలో దాంపత్యంలో ఎలాటి సుఖమూ లేదు. అడిగినవన్నీ లభించేయి! దాసదాసీలు నేను మంచంమీద ఉండగానే నాకన్నీ ఏర్పాటుచేసేవారు. కాని ప్రతీస్త్రీ వాంఛించేది శరీర – ఆత్మ సంతోషాలే! అవి! ఏవిధంగా లభిస్తయ్! యువకుడైన భర్తా, మంచి ఉద్యోగం, ప్రేమ ఉన్నపుడే ప్రాప్తమవుతయ్.

నేను మానసికంగా ఎంతో బాధ చెందాను. నేనుచెందే బాధకు ఒక్కొక్కపుడు తల్లితండ్రుల్ని కాక విధినికూడా నిందించాను కాని విధి! ఏం చెయ్యగలదు! ఈ కట్నాలనేవి మానవులు ఏర్పరచుకున్నవేగా!

నేను కాపురంచేసిన రెండేళ్లూ కష్ట పరంపరలతో గడచిపోయాయి. అంతలోనే నా భర్త క్షయతో మరణించారు. ఆస్తియావత్తూ నాపేరవ్రాసి, దాన్ని నా యిష్టం వచ్చినట్లు వినియోగించవచ్చునన్నారు. నేను వితంతువు నవటంతో ఐదులక్షలఆస్తి నకు లభించింది.

దాని ద్వారా నా పుట్టిల్లు సుఖించింది. తలి, తండ్రులు ఆనందించారు. నేను విధవనవటం, వారికి ధనప్రాప్తి కలుగటం లభించింది. కష్టాలు గట్టెక్కినందుకు అమ్మా నాన్నా ఎంతో సంతోషించారు.

నా భర్త పోవటంతో సంఘంలో కష్టాల్నెదుర్కోవాల్సొచ్చింది. పేరంటానికి వచ్చే స్త్రీలు, నాకు బొట్టు పెట్టకపోవటం, శుభకార్యాలకు పిలవకపోవటం, నన్ను కష్టపెట్టించాయి. నేనూ, ఒక స్త్రీనే అందరూ ఆశించేకోరికలే ఉంటాయి. సినిమాలు చూడాలనీ, నాటకాలకు వెళ్ళాలనీ అనుకునేదాన్ని; నా చిత్తం వచ్చినట్లు చేయటానికి నాకు స్వాతంత్ర్యం లేకపోయింది.

నేను విచారంతో నా యవ్వనాన్నీ, కోర్కెల్ని అణచుకొని జీవించాల్సొచ్చింది. ఈ విషయంలో నేనొక ద్రోహం చేశాను. దాన్ని నీవు మరచినా నేను మరువలేను.

ఆ శనివారంరోజు అంతా గుడికి వెళ్ళారు. నేనొక్కదాన్నే ఇంట్లో ఉన్నా. నేను ఉద్రేకంతో నిన్ను కౌగలించుకున్నాను. అందుకు ఫలితం – చెంపదెబ్బ! నేనీ విషయంలో నిన్ను కష్టపెట్టటమే కాకుండా అవమానింపబడ్డాను.

అందుకే ఈ లోకం విడిచివెళుతున్నా! నాకిక ఎలాటి కోర్కెలూ ఉండవు. కాని నేనొక్కటి కోరతాను. నాలా భారత దేశంలో వితంతువులై, సంఘం మధ్యా, లోకంమధ్యా బాధపడే అనాథులకూ, వర

కట్న నిర్మూలనాశయులకూ నా ఆస్తి లోంచి, సహాయం చెయ్యాలి. మిగిలిన ఆస్తి నా చెల్లికి చెందుతుంది.

ఆఖరి క్షణంలో ఇంకొక కోర్కె మాత్రంఉంది. ఈ లేఖ చూచిన వెంటనే సుబ్బులక్ష్మిని నీవు వివాహం చేసుకోవాలి. ఆనాడే నా ఆత్మకు శాంతి.

తప్పులేమైనా ఉంటే క్షమించు బావా?

నీ "నిర్మల"


సూర్యానికా ఉత్తరం చదివేసరికి కళ్లనుంచి బాష్ప బిందువులు రాలాయి.

సుబ్బులు తన చెంగుతో కన్నీరు తుడుస్తూ బావ ముఖంలోకి చూసింది.

"పద సుబ్బులూ! ఇప్పుడే మీ అక్కయ్య కోర్కె పాటించి, దుర్గ గుడిలో నిన్ను నా దానిగా చేసుకుంటా" అన్నాడు సూర్యం.

సుబ్బులు మెల్లగా కదిలింది. నూతన వధూవరులలా బయలుదేరే సమయంలో నిర్మల ఆత్మకు శాంతి చేకూర్చటానికి కామోలు దుర్గగుడిలోని గంటలు ఒక్కసారిగా మ్రోగాయి. ఆ అంధకారంలో సుబ్బులూ, సూర్యం గుడివైపుకు వెళ్ళారు.

---



న్యూఢిల్లీలో ఏర్పాటు చేయబడిన భారత పారిశ్రామిక ప్రదర్శనములందు బొంబాయి సంక్షేమ బోర్డువారు శ్రామిక కుటుంబమహిళలు తీరిక సమయాలలో తయారుచేసిన వానిని సమీకరించిన వస్తు సామగ్రి